● డిగ్రీ చదువుతున్న ఓ యువకుడు కరీంనగర్‌లోని ఓ మెడికల్ దుకాణానికి వెళ్లి నొప్పులకు ఉపయోగించే పది మాత్రలు ఉండే ఓ షీట్‌ను ఇటీవల కొనుగోలు చేసి తీసుకెళ్లాడు. మత్తుకోసం వాటిని ఉపయోగిస్తున్నాడు.

● కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పలు మెడికల్ దుకాణాల్లో నొప్పుల మాత్రలను ఇష్టమొచ్చినట్లు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో ఓ మెడికల్ దుకాణంపై అధికారులు, పోలీసులు దాడి కేసు నమోదు చేశారు. ఆగస్టులో పెద్దపల్లి జిల్లాలో ఈ మాత్రలు విక్రయిస్తున్న అంశంపై కేసు నమోదైంది. మంథనిలోనూ కేసు నమోదు చేశారు.

ఏ మాత్రం పట్టదు..

● ప్రిస్క్రిప్షన్ లేకున్నా దుకాణాల్లో అమ్మకాలు
● ఔషధాల 'మత్తు'లో యువత

న్యూస్‌టుడే, కరీంనగర్ పట్టణం

వైద్యుల చీటీ లేకుండా కొన్ని రకాల ఔషధాలు విక్రయించకూడదనే నిబంధనలున్నా ఉమ్మడి జిల్లాలోని మెడికల్ దుకాణాల యజమానులు పట్టించుకోవడం లేదు. దీంతో మత్తుకు అలవాటుపడిన కొందరు నొప్పుల మాత్రలు కొనుగోలు చేసి వినియోగిస్తూ రోజంతా మత్తులో జోగుతున్నారు. సంబంధిత అధికారులు వీటిని పట్టించుకోకపోవడంతో విచ్చలవిడిగా ఈ వ్యాపారం సాగుతోంది.

రెట్టింపు ధరలకు..

● పలు రకాల నొప్పులు నయం కావడానికి వైద్యులు రాసే మాత్రలు వాడినప్పుడు నొప్పి తగ్గడంతోపాటు కాస్త మత్తు వచ్చినట్లు ఉంటుంది. కానీ ఈ మాత్రలను యువతతోపాటు అసంఘటిత రంగాల్లో పని చేసే వారు, లారీల డ్రైవర్లు, క్లీనర్లు కొనుక్కుని సూది మందులా వినియోగించి మత్తులో జోగుతున్నారు.

● కరీంనగర్‌లో మాత్రలను కొనుగోలు చేసి రెట్టింపు ధరకు ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. ఉమ్మడి జిల్లాతోపాటు ఆసిఫాబాద్, నిజామాబాద్, మంచిర్యాల తదితర ప్రాంతాల వారికి ఇక్కడి నుంచే సరఫరా అవుతున్నట్లు తెలుస్తోంది.

గతంలో దగ్గు మందు

మత్తులో ఉండేందుకు కొందరు కార్మికులు యువత గతంలో కొన్ని దగ్గు సిరప్‌లు తాగేవారు. వాటిని నిషేధించిన తర్వాత వైట్నర్ వాడారు. ఇప్పుడు నేరుగా నొప్పి మాత్రలను నీళ్లలో కలుపుకొని సూది మందులా వినియోగిస్తున్నారు.

మెదడు దెబ్బతింటుంది

సాధారణంగా ఈ మాత్రలు నొప్పులు తగ్గడం కోసం అవసరమైన మేరకు రాస్తుంటాం. రోగులు మాత్రమే వాడాలి. ఆరోగ్యంగా ఉన్న యువత వాడితే మెదడు దెబ్బతింటుంది. మత్తులో ఉంటారు. ఒక్కోసారి నిద్రలో అకస్మాత్తుగా వచ్చిన ఆలోచనలతో ఇష్టం ఉన్నట్లు వ్యవహరిస్తారు. ఆలోచన ధోరణి మారుతుంది.

- డాక్టర్ ఎం.విజయమోహన్‌రెడ్డి, సీనియర్ ఫిజీషియన్

లైసెన్స్‌లు రద్దు చేస్తాం

డాక్టర్ చీటీ లేకుండా ఇలాంటి మాత్రలు విక్రయించే వారి సమాచారం ఇస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. మెడికల్ షాపుల లైసెన్స్ రద్దు చేస్తాం. ఇప్పటి వరకు రెండు కేసులు నమోదు చేశాం.

- శ్రవణ్‌కుమార్, జిల్లా ఔషధ నియంత్రణాధికారి, కరీంనగర్

మధ్యవర్తుల ప్రమేయం లేకుండా సంప్రదించండి

ప్రజా సమస్యలు వింటున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

గోదావరిఖని, న్యూస్‌టుడే: మధ్యవర్తుల ప్రమేయం లేకుండా సమస్యలపై పోలీసులను నేరుగా సంప్రదించాలని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా వెల్లడించారు. సోమవారం రామగుండం కమిషనరేట్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. కమిషనరేట్ పరిధిలో వివిధ ప్రాంతాలకు చెందిన వారు తమ సమస్యలను సీపీకి విన్నవించారు. వెంటనే వాటిపై స్పందించిన సీపీ సంబంధిత పోలీసు అధికారులకు వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అదనపు డీసీపీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జ్వరం.. కలవరం

జిల్లాలో పెరుగుతున్న బాధితులు

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్

జిల్లాలో జ్వర బాధితులు పెరుగుతున్నారు. పల్లె, పట్టణాల్లో పారిశుద్ధ్యం లోపిస్తోంది. దోమల స్వైర విహారంతో జనాలు రోగాల బారిన పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న ముసుర్లకు తోడు వాతావరణ మార్పులతో జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. పలు ప్రాంతాల్లో డెంగీ పాజిటివ్ కేసులు నమోదు కావడంతో ఆందోళన కలిగిస్తోంది. దోమల నియంత్రణ కోసం ఫాగింగ్ చేయడంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. చాలా చోట్ల ఫాగింగ్ యంత్రాలు మూలనపడ్డాయి. వీటి మరమ్మతు ప్రశ్నార్థకంగా మారింది.

మూలన పరికరాలు..

జిల్లాలో రామగుండం నగర పాలకసంస్థ, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలతో పాటు 263 గ్రామపంచాయతీలున్నాయి. వీటి పరిధిలో ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. మురుగు కాలువల శుభ్రత, జనావాసాల్లో వర్షం నీరు తొలగింపు తలనొప్పిగా మారింది. రోజుల తరబడి మురుగు నీటి నిల్వలు దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. చాలా చోట్ల పంచాయతీల్లో ఫాగింగ్ పరికరాలను బయటకు తీయడం లేదు. వానాకాలానికి ముందు పరికరాలను మరమ్మతు చేయాలనే ఆదేశాలను పట్టించుకోవడం లేదు. పట్టణాల్లో అప్పుడప్పుడు మొక్కుబడిగా ఫాగింగ్ చేసి చేతులు దులుపుకొంటున్నారు.

రెండు నెలల్లో జ్వర సర్వే

నెల	పరీక్షించింది	వ్యాధిగ్రస్థులు
జులై	2,55,689	1,593
ఆగస్టు	1,63,421	1,279

రోగులకు తప్పని ఆర్థికభారం..

జిల్లాలో డెంగీ కలవరం రేపుతోంది. జిల్లా కేంద్రంలోని టీ డయాగ్నొస్టిక్ కేంద్రాల్లో నిత్యం 1,200లకు పైనే పరీక్షలు చేస్తున్నారు. వీటిలో అత్యధికంగా జ్వర బాధితులే ఉంటున్నారు. సుల్తానాబాద్ పట్టణం పూసాల, గర్రెపల్లి, కాల్వశ్రీరాంపూర్ మండలం ఊశన్నపల్లి, పెద్దపల్లి మండలం మూలసాలలో డెంగీ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అందకపోవడంతో రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. వాస్తవంగా డెంగీ నిర్ధారణ 'ఎలిషియా' పరీక్ష టీ డయాగ్నొస్టిక్ కేంద్రంలో ఉన్నప్పటికీ రోగులు ప్రైవేటుకు వెళ్లడంతో రూ.వేలల్లో దోచుకుంటున్నారు.

కాల్వశ్రీరాంపూర్ మండలం ఊశన్నపల్లిలో మురుగు కాలువ దుస్థితి

వ్యాధుల కట్టడికి ప్రత్యేక చర్యలు..

జిల్లాలో సీజనల్ వ్యాధుల కట్టడికి చర్యలు తీసుకుంటున్నాం. అధికారుల సమన్వయంతో డ్రైడే పాటిస్తున్నాం. జ్వర సర్వేలో వ్యాధిగ్రస్థులను గుర్తించి చికిత్స అందిస్తున్నాం. డెంగీ అనుమానిత ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. - పవిత్ర, జిల్లా వైద్యాధికారి

అంగన్‌వాడీ ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు

మంథని, న్యూస్‌టుడే: మంథని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీకి సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మంథని మండలంలో ఖాళీగా ఉన్న 16 అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు 132 మంది అభ్యర్థులు రాగా రాత్రి వరకు ఇంటర్వ్యూలు కొనసాగాయి. కమిటీ ఛైర్మన్ మంథని ఆర్డీవో సురేష్, సభ్యులు మున్సిపల్ కమిషనర్ మనోహర్, రామగుండం సీడీపీవో అలేఖ్యపటేల్ కన్వీనర్ మంథని సీడీపీవో పుష్పలత పాల్గొన్నారు.

ఎరువుల వినియోగంపై అవగాహన

మంథని గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఖానాపూర్ గ్రామంలో సోమవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నానో యూరియా వినియోగం, ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయశాఖ అధికారి డా.నవ్య మాట్లాడుతూ నానో ఎరువులను సరైన మోతాదులో, పంట దశకు అనుగుణంగా వినియోగించడం ద్వారా మొక్కలకు అవసరమైన పోషకాలు సమర్థంగా అందుతాయని తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఎప్పుడు చేకూరుతుందో ప్రయోజనం?

సహాయం కోసం అంగన్‌వాడీ సిబ్బంది ఎదురుచూపులు

న్యూస్‌టుడే, పెద్దపల్లి

● పెద్దపల్లిలోని శ్రీరాంనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పనిచేసిన సొన్నాయిటెంకం రాజమ్మ ఏడాది క్రితం మరణించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన సొమ్ము ఇప్పటి వరకు రాలేదు. కుటుంబసభ్యులు అధికారుల చుట్టూ ఎన్ని పర్యాయాలు తిరిగినా ప్రయోజనం లేదు.

● రామగుండం నగరపాలిక పరిధిలోని వీర్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తీగుట్ల రాధమ్మ ఆయాగా పనిచేసి రిటైర్‌మెంట్ తీసుకున్నారు. ఉద్యోగ విరమణ డబ్బుల కోసం మూడేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరిగి ఇటీవలే మరణించారు.

● ముత్తారం మండలం ఓడేడు గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కేంద్రం టీచర్ అనారోగ్యంతో మరణించారు. అంత్యక్రియల కోసం ఇవ్వాల్సిన రూ.20,000లతో పాటు ఎలాంటి ఆర్థిక సహాయం, బీమా సొమ్ము అందలేదు.

ఇదీ జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలలో పని చేసే ఆయాలు, టీచర్ల పరిస్థితి ఇదీ. ఇలా ఒకరిద్దరు కాదు అనేక మంది విధులు నిర్వహించే వారు, ఉద్యోగ విరమణ చేసిన వారికి ఎదురుచూపులు తప్పడం లేదు. ఇతరత్రా ఆర్థిక సహాయాలేవి అందడం లేదు. పదవీ విరమణ చేసిన వారికి కూడా సొమ్ము చేతిలోకి రాకుండానే మృత్యువాత పడినవారు పదుల సంఖ్యలో ఉన్నారు. నడవడం, మాట్లాడటం కూడా రాని చిన్నపిల్లలకు అక్షరాలు నేర్పించడంతో పాటు వారికి సపర్యలు అందించే అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకుల పట్ల పాలకుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఎంత సేపు కేంద్రంలో జరిగే తప్పులను బూతద్దంలో పెట్టి చూడడమే తప్పా, కేంద్రంలో పనిచేసే టీచర్లు, ఆయాల సంక్షేమ పట్టించుకోవడం లేదని ఆరోపణలున్నాయి.

పర్యవేక్షణపై నిర్లక్ష్యం..

సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పర్యవేక్షణ జరిగే అంగన్‌వాడీ కేంద్రాల సమస్యలు ఏళ్లుగా అపరిష్కృతంగానే ఉన్నాయి. జిల్లాలోని 706 అంగన్‌వాడీ కేంద్రాలలో సగానికి పైగా టీచర్లు, ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొన్ని కేంద్రాలలో టీచర్లుంటే మరికొన్నింటిలో ఆయాలే టీచర్ల పనులు చేయాల్సి వస్తోంది. వీరి గౌరవ వేతనం 2024లో సవరించారు. టీచర్లకు రూ.13,650, ఆయాలకు రూ.7,800 గౌరవ వేతనం అందుతోంది. ఇవి కూడా ప్రతినెల ఆలస్యంగానే అందుతున్నాయి. ఇటీవల ఖాళీగా ఉన్న 64 పోస్టుల కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. జిల్లా పరిధిలో మూడు ప్రాజెక్టుల పరిధిలోని కేంద్రాలను సీడీపీవోలు పర్యవేక్షిస్తున్నారు. కానీ వీరిపై పర్యవేక్షణ చేయాల్సిన జిల్లా సంక్షేమాధికారి బదలీపై వెళ్లడంతో కలెక్టర్ నేరుగా పర్యవేక్షిస్తున్నారు. దీంతో సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లడం కష్టమవుతుందని కింది స్థాయి ఉద్యోగులు చెబుతున్నారు.

దారి మారుస్తూ.. ప్రమాదాలను పిలుస్తూ

● ఇటీవల కోమండ్లపల్లి క్రాసింగ్ నుంచి కాట్నపల్లికి రాంగ్‌రూట్‌లో వచ్చిన ట్రాక్టర్ రోడ్డు దాటుతుండగా కరీంనగర్ వైపు వెళ్తున్న కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో పెద్ద ప్రాణనష్టం తప్పగా ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ సంపత్ గాయపడ్డాడు. ఎలాంటి తప్పు లేకుండా కరీంనగర్ వెళ్తున్న కారు నుజ్జునుజ్జు కాగా సదరు యాజమానికి భారీగా ఆర్థికనష్టం వాటిల్లింది.

● కొంత కాలం క్రితం కోమండ్లపల్లి నుంచి సుల్తానాబాద్‌కు రాంగ్‌రూట్‌లో వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ప్రమాదానికి గురయ్యాయి. ఈ ఘటనలో వాహనదారులు తీవ్రంగా గాయపడ్డారు.

న్యూస్‌టుడే, సుల్తానాబాద్ గ్రామీణం

సుల్తానాబాద్ సర్కిల్ పరిధిలోని రాజీవ్‌రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. రాజీవ్ రహదారి పూర్తిగా గ్రామాలకు ఆనుకొని ఉండగా వివిధ అవసరాల నిమిత్తం రోడ్డెక్కే వాహనదారులు నిత్యం రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాజీవ్‌రహదారి నిర్మాణ సంస్థ రహదారి భద్రత చర్యలను గాలికి వదిలేయడంతో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. రాంగ్‌రూట్ డ్రైవింగ్, డివైడర్ల వద్ద పర్యవేక్షణ లోపమే ఇందుకు ప్రధాన కారణమని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి శివారులోని కోమండ్లపల్లికి వెళ్లే క్రాసింగ్ నుంచి వాహనాల రాంగ్‌రూట్ ప్రయాణం తలనొప్పిగా మారింది.

ఇదీ పరిస్థితి..

కోమండ్లపల్లి క్రాసింగ్ నుంచి వివిధ గ్రామాలకు చెందిన వారు అవసరాల నిమిత్తం సుల్తానాబాద్‌కు రాకపోకలు నిర్వహిస్తుంటారు. క్రాసింగ్ వద్ద డివైడర్ లేదు. నిబంధనల ప్రకారం కోమండ్లపల్లి, నీరుకుళ్ల నుంచి సుల్తానాబాద్‌కు వచ్చే వాహనాలు సుమారు 4 కి.మీ. దూరం ఉన్న నర్సయ్యపల్లి వద్ద యూటర్న్ తీసుకొని తిరిగి రావాలి. దూరభారం అవుతుందనే కారణంతో ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు, ఇసుక ట్రాక్టర్లు, రైస్‌మిల్లులకు వచ్చే లారీలు కోమండ్లపల్లి క్రాసింగ్ నుంచి కాట్నపల్లి స్టేజ్ వద్దకు రాంగ్‌రూట్‌లోనే వస్తున్నాయి. దీంతో ఈ మార్గంలో ప్రమాదాలు పెరిగిపోతున్నాయి.

కోమండ్లపల్లి క్రాసింగ్ నుంచి రాంగ్ రూట్‌లో వస్తున్న వాహనాలు

వాహనదారుల్లో చైతన్యం రావాలి..

రాజీవ్ రహదారిపై రాకపోకలు నిర్వహించే వాహనదారుల్లో చైతన్యం రావాలి. రాంగ్‌రూట్ ప్రయాణం, అధిక వేగాన్ని తగ్గించాలి. కోమండ్లపల్లి క్రాసింగ్ నుంచి రాంగ్‌రూట్ ప్రయాణం వల్ల కాట్నపల్లి స్టేజీ వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రతిరోజు బ్లూకోల్ట్ సిబ్బందితో నిఘా చేపడుతున్నాం. రాంగ్‌రూట్‌లో పట్టుబడితే వాహనాలను సీజ్ చేస్తాం.

- చంద్రకుమార్, ఎస్సై, సుల్తానాబాద్

లైసెన్స్‌డ్ సర్వేయర్ల ఆందోళన

అంబేడ్కర్ విగ్రహం ఎదుట నినాదాలు చేస్తున్న సర్వేయర్లు

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో 31 మంది సర్వేయర్ల లైసెన్స్ రద్దు చేయడాన్ని నిరసిస్తూ తెలంగాణ లైసెన్స్‌డ్ సర్వేయర్ల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. అక్కడి నుంచి ర్యాలీగా బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వరకు చేరుకుని న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని పెద్ద మొత్తంలో తొలగించడం అన్యాయమన్నారు. తమకు తగిన పనులు అప్పజెప్పకుండా కాలయాపన చేయడంతో ఇబ్బందులు పడుతున్నామని వెల్లడించారు. అనిల్, రాజు, అరవింద్ పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తుల రద్దీ

ధర్మపురి, న్యూస్‌టుడే: ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శ్రావణమాసం సోమవారం సందర్భంగా భక్తుల రద్దీ నెలకొంది. శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో లఘున్యాస పూర్వకంగా రుద్రాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అక్కపల్లి శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ ఏర్పడింది. సంకష్ట హర చతుర్థి సందర్భంగా గణపతికి పూజలు చేశారు. దేవస్థానం ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. దేవస్థానానికి రూ.2,06,722 ఆదాయం సమకూరింది.

గణపతికి పూజలు

పనుల్లో జాప్యం.. తప్పని ఇబ్బందులు

మంథనిలో విద్యుత్తు నియంత్రిక మరమ్మతు కేంద్రం నిర్మాణ పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో నియంత్రికల మరమ్మతు కోసం పెద్దపల్లికి తీసుకెళ్లడం, తీసుకొని రావడం ఆర్థిక భారంగా మారుతోంది. ఉత్తర విద్యుత్తు పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో రూ.80 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసే విద్యుత్తు నియంత్రిక మరమ్మతు కేంద్రానికి 2025 సెప్టెంబరు 11న మంత్రి శ్రీధర్‌బాబు శంకుస్థాపన చేశారు. రెవెన్యూ అధికారులు ఎకరం భూమిని కేటాయించినా పనులు చేపట్టడం లేదు. కేటాయించిన భూమి వివాదాస్పదంగా మారడంతో పరిష్కారంలో జాప్యంతో పనులు చేపట్టడం లేదని మంథని విద్యుత్తు ఏడీఈ వెంకటనారాయణ తెలిపారు.

- న్యూస్‌టుడే, మంథని

నిర్మాణంలో నిర్లక్ష్యం.. నిల్వనీటితో తిప్పలు

రహదారి నిర్మాణంలో నిబంధనలు పాటించకపోవడంతో వాహనదారుల పాలిట శాపంగా మారింది. అడ్డగుంటపల్లి కూడలి నుంచి రాజీవ్ నగర్ వైపు నిర్మించిన ప్రధాన రహదారిలో చిన్నపాటి వర్షం కురిసినా రహదారి జలమయమవుతోంది. రోడ్డుపైనీరు కిందికి వెళ్లేలా పల్లంగా నిర్మించాల్సి ఉండగా మధ్యలో వాలు చేయడంతో నీరు నిలుస్తోంది. ఒక్క సారి వర్షం కురిస్తే మూడు రోజుల వరకు తిప్పలు తప్పవు. - న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం

మల్లికార్జునస్వామి ఆలయానికి మహర్దశ

రూ.15 కోట్ల వ్యయంతో ఆలయ పునర్నిర్మాణానికి అడుగులు

బృహత్ ప్రణాళికపై దేవాదాయశాఖ స్థపతి వల్లినాయకంతో సమీక్షిస్తున్న విప్ విజయరమణారావు

ఓదెల, న్యూస్‌టుడే: ఓదెల శ్రీమల్లికార్జునస్వామి ఆలయ పునఃనిర్మాణానికి ఎట్టకేలకు అడుగులు పడ్డాయి. అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచి, సరైన వసతులు లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పురాతన కాలం నాటి ఆలయం కావడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరి వర్షాకాలంలో పైకప్పు కురుస్తోంది.

బృహత్ ప్రణాళిక సిద్ధం..

ప్రస్తుతం మల్లికార్జున స్వామి ఆలయంతో పాటు దానికి సమాంతరంగా ఉన్న శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయాన్ని విశాలంగా నిర్మించేందుకు బృహత్ ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వ విప్ సీహెచ్.విజయరమణారావు, దేవాదాయశాఖ స్థపతి వల్లినాయకం పర్యవేక్షణలో వందశాతం వాస్తుతో ఆలయ పునఃనిర్మాణానికి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.10 కోట్లు, ఆలయ నిధులు రూ.5 కోట్లతో ఈ సెప్టెంబరు నెలలో పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

చేపట్టాల్సిన పనులివీ..

ఆలయ గర్భగుడితో పాటు దేవాలయ మండపాలు, గోపురాలు, ప్రాకార మండపాలు పునర్నిర్మాణం చేయాల్సిన అవసరం ఉంది. భక్తుల విడిదికి తగినన్ని వసతి గృహాలు, ఓపెన్ షెడ్లు, సులభ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం చేపట్టాలి. వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలి. భక్తుల సౌకర్యార్థం పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ కల్పిస్తూ ఉమ్మడి జిల్లాలోని పుణ్యక్షేత్రాలను అనుసంధానిస్తూ బస్సు రవాణా సౌకర్యాన్ని మెరుగు పరచాలి.

● మల్లన్న ఆలయానికి ఉన్న చారిత్రక ప్రాశస్త్యం ఉట్టిపడేలా నూతన ఆలయాన్ని పునర్నిర్మాణం చేసేందుకు చర్యలు చేపడుతున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి బి.సదయ్య తెలిపారు. మంజూరైన నిధులతో మల్లన్న ఆలయం, శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం, మహా రాజగోపురం, ప్రాకార మండప నిర్మాణాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

● ఆలయ పునర్నిర్మాణానికి మంజూరైన రూ.15కోట్లతో పాటు అదనంగా పర్యాటక శాఖ నుంచి మరో రూ.8కోట్ల మంజూరుకు కృషి చేస్తామని విప్ విజయరమణారావు తెలిపారు. ఆలయ ఆవరణలో అతిథి గృహం, ఆలయ రింగ్ రోడ్డు చుట్టూ లైటింగ్, ఇతర అభివృద్ధి పనులకు కృషి చేస్తామన్నారు.

చేయూతకు దరఖాస్తుల వెల్లువ

ఉమ్మడి జిల్లాలో 52,433 నమోదు

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్

సుదీర్ఘ కాలం తర్వాత ప్రభుత్వం చేయూత(ఆసరా) పథకంలో పింఛన్ పొందేందుకు అవకాశం కల్పించింది. అర్హులు ఆధార పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆదేశించింది. ఈ క్రమంలో ఆశావహులు భారీగా దరఖాస్తు చేసుకున్నారు. అవసరమైన పత్రాలతో మీసేవ కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో కరీంనగర్, రామగుండం నగరపాలక సంస్థలు కావడంతో పంచాయతీల్లోనే భారీగా దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం నాటికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 52,433 దరఖాస్తులు వచ్చాయి.

ఉమ్మడి జిల్లాలో దరఖాస్తుల వివరాలు

	జగిత్యాల	కరీంనగర్	పెద్దపల్లి	రాజన్నసిరిసిల్ల
వితంతు	5,732	8,542	7,112	3,571
ఒంటరి మహిళా	1,086	983	869	301
దివ్యాంగులు	2,266	6,559	2,836	1,808
చేనేత	2,191	1,122	469	937
గీత కార్మిక	1,970	1,745	1,305	1,018

అనర్హులను తొలగించి జాబితా..

ఉమ్మడి జిల్లాలో 52,433 దరఖాస్తులు రాగా వీటిలో జగిత్యాలలో 13,256, కరీంనగర్ 18,951, పెద్దపల్లిలో 12,591, రాజన్న సిరిసిల్లలో 7,635 దరఖాస్తులు నమోదయ్యాయి. వీటిలో అత్యధికంగా వితంతువులు 24,957, తర్వాత 13,469 దివ్యాంగులు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవో, మున్సిపల్ పరిధిలో కమిషనర్ పర్యవేక్షణలో దరఖాస్తులు పరిశీలించనున్నారు. అక్రమాలకు తావులేకుండా 360 డిగ్రీల సాంకేతిక విధానంతో వడబోత చేపట్టనున్నారు. అనర్హులను తొలగించి జాబితా రూపొందించనున్నారు.

తప్పని దళారుల బెడద..

చేయూత పింఛన్ కోసం దరఖాస్తుల స్వీకరణ మొదలు నుంచి దళారులు అమాయకులను మచ్చిక చేసుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో కొందరు ప్రజాప్రతినిధులు బేరసారాలు కుదుర్చుకుంటున్నారు. ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగిన బాధితులు అడిగినంతా ఇచ్చేందుకు అంగీకరిస్తున్నట్లు అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. రామగుండంలో ప్రజాప్రతినిధుల జోక్యంపై ఆరోపణలు రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కలెక్టర్లు స్పందిస్తూ దళారులను ఆశ్రయించరాదని ప్రకటనలు చేస్తున్నప్పటికీ ఫలితం లేకుండా పోతోంది.

వారికి గేటు.. వీరికి చేటు

గౌరెడ్డిపేట ఆర్వోబీతో ఐటీఐ కాలనీకి అవస్థలు

న్యూస్‌టుడే, పెద్దపల్లి

రైలు గేటు పడితే గంటల తరబడి పడిగాపులు పడాల్సి వస్తుంది. వీరి గేటు కష్టాలకు ముగింపు పలికేందుకు పాలకులు తీసుకునే నిర్ణయం పలు కాలనీలవాసులకు చేటు కలిగించే విధంగా మారింది. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని గౌరెడ్డిపేట రైల్వే గేటు స్థానంలో మంజూరైన ఆర్వోబీతో పట్టణంలోని రైల్వేకాలనీ, ఐటీఐ కాలనీవాసులకు అవస్థలు మొదలయ్యాయి. ఆర్వోబీ నిర్మాణంతో ఇళ్లు, ఇళ్ల స్థలాలను కోల్పోవలసి వస్తోంది. ప్రస్తుత రోడ్డుకు సమాంతరంగా కాకుండా కొత్త దారిలో ఆర్వోబీ ప్రతిపాదించడంతోనే సమస్యలు ఉత్పన్నమయ్యాయి. రైల్వేశాఖ తాజా నిర్ణయంతో స్థానికుల నుంచి వ్యతిరేకత వస్తోంది. మొదట ఈ ప్రాజెక్టును పక్కనబెట్టిన అధికారులు భూసేకరణ చేపట్టడం వివాదాస్పదమవుతోంది.

ప్రతిపాదిత ఆర్వోబీ ఈ రోడ్డు మధ్య నుంచి వెళుతుంది

స్టేషన్‌కు ఇరువైపులా..

పెద్దపల్లి రైల్వేస్టేషన్‌కు ఇరువైపులా రెండేసి లెవల్ క్రాసింగ్ గేట్లున్నాయి. వీటిలో ఇరవయ్యేళ్ల క్రితం మంథని ఆర్వోబీ అందుబాటులోకి రావడంతో ఆ గేటు మూతపడింది. నాలుగు వరుసల కూనారం ఆర్వోబీ నిర్మాణం జరుగుతోంది. తాజాగా చీకురాయి వద్ద ఒక ఆర్వోబీ, గౌరెడ్డిపేట వైపు వెళ్లేందుకు మరో దాన్ని రైల్వేశాఖ మంజూరు చేసింది. వీటిలో గౌరెడ్డిపేట గేటు రైల్వేస్టేషన్‌కు అతి చేరువలో ఉండటంతో దీని నిర్మాణం వల్ల రైల్వే శాఖకు చెందిన పలు భవనాలతో పాటు ఐటీఐ కాలనీలోని నిర్మాణాలు ప్రమాదంలో పడ్డాయి. ఐటీఐ మైదానం కూడా కొంత వరకు ఆర్వోబీ నిర్మాణం కోసం వెళుతోంది. ఈ గేటుకు అవతలివైపు కేవలం మూడు గ్రామాలే ఉన్నాయి. వీటిలో గౌరెడ్డిపేట నుంచి రాఘవపూర్, ముత్తారం నుంచి హన్మంతునిపేటకు రహదారులున్నాయి.

ఒక్క రోడ్డుతో పరిష్కారం..

జిల్లా కేంద్రంలోని ఐదు ఎల్సీలలో మంథని, కూనారం ఆర్వోబీలతో పాటు గౌరెడ్డిపేట, చీకురాయి ఆర్వోబీలు మంజూరయ్యాయి. వీటిలో కూనారం, గౌరెడ్డిపేట ఎల్సీలు రైల్వేస్టేషన్‌కు చేరువలో ఉండగా మంథని, చీకురాయి(ప్రతిపాదిత) ఆర్వోబీలు కిలోమీటరు దూరంలో ఉన్నాయి. రైల్వేస్టేషన్ అవతలివైపు ఎల్సీలను అనుసంధానం చేసే రహదారిని నిర్మిస్తే నాలుగు ఎల్సీలు రోడ్డుతో అనుసంధానమవడంతో పాటు స్టేషన్‌కు కుడి, ఎడమలుగా ఉన్న గౌరెడ్డిపేట, కూనారం ఎల్సీలు చేరువవుతాయి. అదేవిధంగా పెద్దపల్లి టౌన్ రైల్వే స్టేషన్ కూడా ప్రధాన స్టేషన్‌తో రోడ్డు అనుసంధానమవుతుంది. గౌరెడ్డిపేట గ్రామస్థుల సౌకర్యార్థం గేటు స్థానంలో ఎఫ్‌వోపీ(ఫుట్ ఓవర్ బ్రిడ్జి) నిర్మిస్తే సమస్య సానుకూలమవుతుంది.

నిషేధిత జాబితాను పక్కాగా పరిశీలించండి

పెద్దపల్లి కలెక్టరేట్: జిల్లాలో నిషేధిత భూముల జాబితాను పక్కాగా పరిశీలించాలని కలెక్టర్ శ్రీహర్ష తెలిపారు. ప్రైవేటు పట్టా భూములు 22ఏ జాబితాలో ఉంటే అన్ని ఆధార పత్రాలతో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.

నమూన ప్రకటన
బహిరంగ ప్రకటన
విజ్ఞతగల నిర్ణయం.
వివాదాలకు అతీతం.

25% డిస్కౌంట్ కలదు
లక్షల విలువైన స్థిరాస్తిని కొనేముందు సరైన నిర్ణయం తీసుకోవడం అవసరం. 'ఈనాడు'లో బహిరంగ ప్రకటన ఇవ్వడం ఎంతో సులభం.
GST 5% Applicable
వివరాలకు సంప్రదించండి :
Cell: 80087 09949
పెద్దపల్లి: 97011 19492

(c) eenadu

చీడపీడలు.. యాజమాన్య పద్ధతులు

న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం

ప్రధాన పంట మామిడిలో ఇటీవల చీడపీడలు పెరగటం, కాతతగ్గటం వంటి పలు సమస్యలు తలెత్తుతున్నాయి. కేవలం కాత సమయంలోనే కాకుండా కాయలు తెంపిన తర్వాత నుంచి మామిడి తోటల్లో తగిన యాజమాన్య పద్ధతులు చేపడితేనే తదుపరి సీజన్‌లో అధిక, నాణ్యమైన కాత చేతికివస్తుందని ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ కె.స్వాతి సూచిస్తున్నారు.

రైతేరాజు

మామిడిచెట్లు

☛ ఒక కిలో మైలుతుత్తం, ఒక కిలో పొడిసున్నాన్ని 100 లీటర్ల నీటికి కలిపి తయారుచేస్తే 1 శాతం బోర్డోమిశ్రమం తయారవుతుంది. కొమ్మలు తొలగించిన తరువాత తెగుళ్లు సోకకుండా ఉండేందుకు ఈ మిశ్రమాన్ని చెట్లపై పిచికారీ చేయాలి, లేదా కొమ్మ కత్తిరించిన భాగాలపై బోర్డోపేస్టును పూయాలి. బోర్డో మిశ్రమాన్ని ఎప్పటికప్పుడు తయారు చేసుకోవచ్చు.

☛ మామిడి కాయలు తెంపిన తరువాత చెట్లపై ఎండిన, అడ్డదిడ్డంగా పెరిగిన, చీడపీడలు ఆశించిన కొమ్మలను, ఆకులను తీసివేయటం ద్వారా చెట్టు లోపలి భాగాలకు గాలి, వెలుతురు బాగా అంది చీడపీడల బెడద తగ్గుతుంది. తోటలో రాలి, కుళ్లిపోయిన కాయలు, చెత్తాచెదారాన్ని తీసివేయాలి.

☛ వర్షాలు లేదా నీటితడితో నేల తడిగా మారిన తరువాత పశువుల ఎరువు లేదా వర్మీకంపోస్టును మొక్కల మొదళ్ల చుట్టూ వేసి చెట్లమధ్యన దున్నాలి. చిన్నచెట్లు గల తోటల్లో పెసర, మినుము, అలసంద, వేరుసెనగ, అల్లం, కూరగాయలు తదితర అంతర పంటలు లేదా జనుము, జీలుగ, పిల్లిపెసర తదితర పచ్చిరొట్ట పైర్లను సాగుచేయవచ్చు.

☛ తొలిదశలో చెట్టుకు 750 గ్రాముల యూరియా, 2 కిలోల ఫాస్ఫరస్, అరకిలో పొటాష్‌ను వేయాలి. ఆగస్టు నుంచి చెట్లు చిగురించే దశలో 100 గ్రాముల జింకు, 50 గ్రాముల బోరాన్ చొప్పున ఒక్కో చెట్టుకు వేయాలి. సెప్టెంబరులో 5 శాతం జింకుసల్ఫేట్, 2 గ్రాముల చొప్పున మెగ్నీషియం, మాంగనీస్, ఫెర్రస్, బోరాక్స్, 6 శాతం రాళ్లసున్నం, 10 గ్రాముల యూరియాను సాండోవిట్‌తో కలిపి పిచికారీ చేయవచ్చు. లేతాకుల దశలో ఆకుగూడు పురుగు నివారణకు వేపనూనె పిచికారీ చేయాలి. తీవ్రత అధికంగా ఉన్నప్పుడు లీటరు నీటికి 2 మి.లీ క్లోరోఫైరిఫాస్‌ను కలిపి పిచికారీ చేయాలి.

☛ తేనెమంచు పురుగు నిరోధానికి సెప్టెంబరు తరువాత లీటరు నీటికి 2 మి.లీ.ల క్లోరోఫైరిఫాస్ వంతున కలిపి చెట్లపై పిచికారీ చేయాలి. చెట్ల వయసును బట్టి పదేళ్ల వయసుగల చెట్టుకు 2.2 కిలోల యూరియా, 6 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 1.6 కిలోల పొటాష్ ఎరువులను వేయాలి. అక్టోబరు తొలివారంలో పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు లీటరు నీటికి కలిపి చల్లాలి. డిసెంబరు మొదటి పక్షంలో తేలికపాటి నీటితడిని ఇవ్వాలి. బిందుసేద్యం గల రైతులు రసాయన ఎరువులను బిందుసేద్య పరికరాల ద్వారా(ఫర్టిగేషన్) అందించవచ్చు. ఇందుకు నీటిలో కరిగే రసాయన ఎరువులను వాడాలి.

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం

సాగులో రైతుల సందేహాలను జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త **జి.వేణుగోపాల్** నివృత్తి చేశారు.

? బంతిలో మొగ్గ తెగులు నివారణకు ఏం చేయాలి. – మనోహర్‌రెడ్డి, మాచనపల్లి

✓ కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి మొగ్గలు విచ్చుకోకముందే పిచికారీ చేయాలి.

? పొద చిక్కుడులో పురుగు నివారణ ఎలా. – శ్రీహరి, బేతిగల్

✓ పురుగు ఉద్ధృతిని బట్టి ఎకరానికి 200 లీటర్ల నీటిలో ఫ్లూబెండమైడ్ 60 మి.లీ కలిపి పిచికారీ చేయాలి.

? పాలకూర ఆకులు ముడతలు వస్తే ఏం చేయాలి. – వెంకన్న, సైదాబాద్

✓ 3 గ్రాముల పోషకాలను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

? లిల్లీ పూలను రసం పీల్చే పరుగులు ఆశిస్తున్నాయి. –రజనీకాంత్, వెల్లంపల్లి

✓ నివారణకు లీటరు నీటికి డైమిథోయేట్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

? వంగ తోటలో నల్లి ఎక్కువగా కనిపిస్తోంది. – రాజేశ్వర్‌రావు, శ్రీరాములపేట

✓ నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

- న్యూస్‌టుడే, జమ్మికుంట

పశు పోషణతో లాభాల పంట

పశువుల పాకలో గేదెలు

పశుపోషణతో లాభాలు ఆర్జిస్తున్నారు పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం సిద్దపల్లె గ్రామానికి చెందిన జాబు సతీశ్‌కుమార్. వివరాలు ఆయన మాటల్లోనే.. నాకున్న అయిదున్నర ఎకరాల భూమిలో 5 ఎకరాల్లో వరిసాగు చేస్తున్నా. ఇంటి సమీపంలోని 30 గుంటల భూమిలో 5 గుంటల్లో పశువుల కోసం ప్రత్యేకంగా షెడ్డు వేసి ముర్రా, ఒంగోలు జాతికి చెందిన గేదెలను తెచ్చా. 10 గుంటల్లో ఏపీపీఎన్, సుపిరియర్‌పిన్నియా జాతి గడ్డిని పెంచుతున్నా. నిత్యం ఉదయం 40-50 లీటర్ల పాలను యైటింక్లయిన్‌కాలనీ, మహాకవిపోతన కాలనీ ఏరియాలోని సింగరేణి కుటుంబాలకు లీటరు రూ.80 చొప్పున విక్రయిస్తున్నా. ఒక్కో గేదె 8-10 లీటర్ల పాలు ఇస్తుంది. ఎదకు వచ్చేంత వరకు పాలిస్తాయి. మొదటి ఆరు మాసాలు 11, మరో ఆరు మాసాలు 8 గేదెలు పాలు ఇస్తుంటాయి. దూడల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించడంతో కొత్తవి కొనుగోలు చేయాల్సిన అవసరం రాదు. పచ్చి, ఎండుగడ్డితో పాటు పెసరపొట్టు, గోధుమపరం, పల్లిపిండి, బెల్లం దాణాగా వేస్తుంటా. 15 రోజులకు ఒకసారి పశువైద్యుడితో వైద్యపరీక్షలు చేయిస్తా. మొత్తం నెలకు ఖర్చు రూ.30 వేల వరకు వస్తుండగా దాదాపు రూ.80 వేల ఆదాయం వస్తోంది.

సతీశ్‌కుమార్

ఆదర్శం

- న్యూస్‌టుడే, యైటింక్లయిన్‌కాలనీ

రసాయనాలు లేకుండా కూరగాయల సాగు

మీకు తెలుసా?

కూరగాయలను పండించదలిస్తే దుక్కిలోనే పశువులు, కోళ్ల, జీవాల ఎరువు లేదా వర్మీకంపోస్టును వేసి కలియదున్నాలి. వేపపిండి, వేరుసెనగపిండి, ఆముదపుపిండి తదితరాలు వాడొచ్చు. పంటమార్పిడి పాటించాలి. వ్యవసాయ వ్యర్థాలను కాల్చివేయకుండా నేలలోనే కలియదున్నాలి. జీవన ఎరువులైన అజటోబాక్టర్, అజోస్పైరిల్లం, ఫాస్ఫోబ్యాక్టీరియాను వినియోగించవచ్చు. రసాయనాలు వాడకుండా సహజ సస్యరక్షణ యాజమాన్యం, జీవ నియంత్రణ పద్ధతులు పాటించాలి. అవసరముంటే వేపనూనెను పిచికారీ చేయాలి. సేంద్రియ పద్ధతులవల్ల పంటనాణ్యత పెరిగి మన ఆరోగ్యం బాగుంటుంది.

- న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం

పర్యావరణ హితుడు.. మట్టి గణపతి

న్యూస్‌టుడే, ఫెర్టిలైజర్ సిటీ

గణపతి నవరాత్రి ఉత్సవాలు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. వాడవాడలా విగ్రహాలు నెలకొల్పేందుకు ఉత్సవ కమిటీలు సన్నద్ధమవుతున్నాయి. ఇప్పటికే విగ్రహాల తయారీ కేంద్రాల్లో ముందస్తు బుకింగ్‌లు చేసుకొంటున్నారు. ఉమ్మడి జిల్లాలో అయిదు వేలకు పైగా వినాయక మండపాలు ఏర్పాటు చేస్తుండగా మట్టి ప్రతిమలను ఏర్పాటు చేసేవి వంద లోపే ఉండటం గమనార్హం. ఇళ్లల్లో మాత్రం ఎక్కువగా మట్టి ప్రతిమల ఏర్పాటుకు ప్రాధాన్యమిస్తుంటారు. స్వచ్ఛంద సంస్థలు మట్టి విగ్రహాలతో కలిగే ప్రయోజనాలు, పీవోపీ(ప్లాస్టర్ ఆఫ్ పారిస్) విగ్రహాలతో కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తున్నారు. అయినప్పటికీ ఎక్కువ మంది తక్కువ ధరకు వస్తుందనే కోణంలో ఎక్కువగా పీవోపీ వైపే మొగ్గు చూపుతున్నారు.

స్వచ్ఛంద సంస్థల తోడ్పాటు

ఉమ్మడి జిల్లాలో కొన్ని స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా మట్టి ప్రతిమలను పంపిణీ చేయడంతో పాటు ఎత్తయిన విగ్రహాలను నెలకొల్పుతుంటారు. పెద్దపల్లిలోని ఛత్రపతి యువసేన ఆధ్వర్యంలో మూడు దశాబ్దాలుగా మట్టి విగ్రహాలను ఏర్పాటు చేస్తుండగా ఎనిమిదేళ్లుగా 63 అడుగుల మట్టి విగ్రహాన్ని నెలకొల్పుతున్నారు. అగ్నిమాపక యంత్రం ద్వారా నెలకొల్పిన ప్రదేశంలోనే నిమజ్జనం చేస్తుంటారు. మట్టి విగ్రహాల తయారీలో మట్టి, కొబ్బరిపీచు, వెదురు, జనుము మాత్రమే వినియోగించడంతో పర్యావరణానికి ఎలాంటి నష్టం ఉండదు. రామగుండం నగరపాలక ప్రాంతంలో తెలంగాణ మహిళా మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రెండు దశాబ్దాలుగా మట్టి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేయడంతో పాటు మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. మట్టి ప్రతిమలపై ప్రజల్లో అవగాహన కల్పించేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి ప్రతిమలనే పూజించాలంటూ సదస్సులు నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.

పెద్దపల్లిలో సిద్ధమవుతున్న 63 అడుగుల మట్టిప్రతిమ

ఆర్భాటాలకే అధిక ప్రాధాన్యం

సెప్టెంబరు 14 నుంచి వినాయక నవరాత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. పూజకు వినియోగించే వివిధ రకాల పత్రాలతో పాటు ప్రతిమల్లోనూ పర్యావరణ హితం, ఆరోగ్య పరిరక్షణ ఉంటుంది. భక్తితో చేసే పూజల కంటే ఆర్భాటాలకే అధిక ప్రాధాన్యతనిస్తూ ఎత్తయిన పీవోపీ విగ్రహాలను ఏర్పాటు చేస్తుంటారు. ఈ విగ్రహాలను నదులు, చెరువుల్లో నిమజ్జనం చేస్తే సులువుగా కరగకపోవడంతో పాటు జలచరాలకు నష్టం చేకూరుస్తాయి. మట్టి విగ్రహాలు నిమజ్జనం చేసిన కొంత సమయానికే కరిగిపోతాయి. ఎలాంటి కాలుష్యం ఉండదు. గణపతి మండపాల నిర్వాహకులు, భక్తులు, పర్యావరణహితం కోరే వారు స్పందిస్తేనే ప్రయోజనం చేకూరే అవకాశం ఉంటుంది.

మంచిర్యాలలో కేంద్రీకృత వంటశాల

మంచిర్యాలఅర్బన్, న్యూస్‌టుడే : తెలంగాణ స్కూల్ బ్రేక్ ఫాస్ట్ ప్రోగ్రాంలో భాగంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలో సోమవారం కేంద్రీకృత వంటశాలను ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ప్రారంభించారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్, సింగరేణి సంస్థ భాగస్వామ్యంతో ఏర్పాటైన వంటశాలలో మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లోని 691 ప్రభుత్వ పాఠశాలలు, 13 జూనియర్ కళాశాలలకు చెందిన 49,109 మంది విద్యార్థులకు రోజూ రుచికరమైన, పరిశుభ్రమైన అల్పాహారం ఆరంభమైంది. ఈ తయారీ విధానాన్ని ఎమ్మెల్యేతో పాటు జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్, సింగరేణి అధికారులు పర్యవేక్షించారు. డీసీపీ భాస్కర్, అదనపు కలెక్టర్ చంద్రయ్య, సింగరేణి అధికారులు రాధాకృష్ణ, ఎ.వెంకటేశ్వర్‌రెడ్డి, హరేకృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ప్రతినిధులు సత్య గౌరచంద్ర దాస పాల్గొన్నారు.

వర్షం నమోదు తెలుసుకోండిలా..

న్యూస్‌టుడే, పాలకుర్తి

మీకోసం

వర్షాకాలంలో ఏ ప్రాంతంలో ఎంత వర్షపాతం కురిసిందో తెలుసుకోవాలంటే వెబ్‌సైట్ అందుబాటులో ఉందనే విషయం చాలా మందికి తెలియదు. హెచ్‌టీటీపీఎస్:// టీఎస్‌డీపీఎస్.తెలంగాణ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వాతావరణ వివరాలు, ఏ జిల్లాలో, ఏ మండలంలో ఎంత వర్షపాతం నమోదైందో తెలుసుకోవచ్చు.

వర్షం రకాలు (మి.మీ.లలో)

0.0-0.2	వర్షం లేదు
0.3-2.4	చాలా తేలికపాటి
2.5-15.5	తేలికపాటి
15.6-64.4	సాధారణ
64.5-115.5	భారీ
115.6-204.4	అతి భారీ

వర్షపాతాన్ని సేకరించే విధానం

సాధారణంగా ఉదయం 8.30 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 8.30 గంటల వరకు(24 గంటల వ్యవధిలో) కురిసిన వర్షాన్ని సేకరించి ఆ రోజు వర్షపాతంగా నమోదు చేస్తారు.

◆ 204.5 మి.మీ.లు లేదా అంతకు మించి కురిసిన వర్షాన్ని అత్యంత భారీ వర్షంగా పరిగణిస్తారు.

◆ ఒక మిల్లీ మీటరు వర్షపాతం అంటే: ఒక చదరపు మీటరు నేలపై ఒక లీటరు నీరు నిలిచిందని అర్థం.

త్వరలోనే ఎథిక్స్ కమిటీ అంశంపై స్పందిస్తా : కౌశిక్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: తాను భారాస బీ ఫారం మీద గెలిచి ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాడుతున్నానని.. అమ్ముడుపోలేదని. . దీనిపై అసెంబ్లీ ఎథిక్స్ కమిటీయే ఆలోచన చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. హుజూరాబాద్ మున్సిపల్ పరిధి కేసీ క్యాంపులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారాస తరఫున గెలిచిన వ్యక్తి.. కాంగ్రెస్ కండువా కప్పుకొని తిరుగుతుండటంతో ఏ పార్టీ నుంచి మాట్లాడుతున్నావో అడగటం తప్పా అని ప్రశ్నించారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పటికీ.. ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్న వారికి విలువలు ఉన్నట్లా, అమ్ముడుపోయిన వ్యక్తికి ఉన్నట్లా అని ఎద్దేవా చేశారు. త్వరలోనే ఎథిక్స్ కమిటీ అంశంపై స్పందిస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు ఎండగట్టేందుకు భారాస ఆధ్వర్యంలో ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకు హుజూరాబాద్ నియోజకవర్గవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. 2న ఉదయం 10 గంటలకు హుజూరాబాద్ అంబేడ్కర్ కూడలి వద్ద 420 అడుగుల భారీ ఫ్లెక్సీతో ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. 3న వీణవంకలో రైతులతో ధర్నా, 4న కమలాపూర్‌లో మహిళలు, విద్యార్థినులతో కలిసి వంటావార్పు, 5న జమ్మికుంటలో విద్యార్థులు, నిరుద్యోగ యువకులతో ర్యాలీ, 6న హుజూరాబాద్, జమ్మికుంట, ఇల్లందకుంట మండల కేంద్రాల్లో ఆటో కార్మికులతో నిరసన, 7న అన్ని మండల కేంద్రాల్లోని ప్రజావాణిలో వేలాది మందితో వినతిపత్రాల అందజేత, 8న జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ శ్రీనివాస్, రమేష్, సురేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, గందె శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

విద్యుత్తు అమరవీరుల స్తూపం ప్రారంభం

విద్యుత్తు అమరవీరుల స్మారక స్తూపాన్ని ఆవిష్కరిస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

భగత్‌నగర్, న్యూస్‌టుడే: కరీంనగర్‌లోని విద్యుత్తు సంస్థ సర్కిల్ ఆవరణలో నిర్మించిన విద్యుత్తు అమరవీరుల స్మారక స్తూపాన్ని ఆ సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి సోమవారం రాత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సంస్థలో రక్షణ ప్రమాణాల ప్రాధాన్యత, అమరుల త్యాగాలను గుర్తుచేశారు. ప్రజలకు నిరంతరం విద్యుత్తు సేవలు అందించేందుకు ప్రాణాలను పణంగా పెట్టిన వారి త్యాగాలు స్మరించదగ్గవన్నారు. జీరో యాక్సిడెంట్ లక్ష్యంగా పని చేయాలన్నారు. ప్రతి ఉద్యోగికి నాణ్యమైన భద్రతా పరికరాలు, అవసరమైన శిక్షణ అందిస్తున్నామన్నారు. ఎంత అనుభవం ఉన్నా సేఫ్టీ ప్రొటోకాల్స్, ఎర్తింగ్ విధానాలను తప్పక పాటించాలన్నారు. అనంతరం సీతారాంపూర్‌లోని ఓ వేడుకల మందిరంలో జరిగిన ఎస్ఈ రాపెల్లి రవీందర్ పదవీ విరమణ ఉత్సవంలో పాల్గొన్నారు.

వరి పొలంలో పడి రైతు మృతి

నర్సయ్య

గంగాధర, న్యూస్‌టుడే: కాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సరిపల్లి నర్సయ్య(60) అనే రైతు సోమవారం వరిపొలంలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు వరి చేను వద్ద కట్టేసి ఉంచిన దూడను ఇంటికి తీసుకురావడానికి వెళ్లే సమయంలో కాలుజారి ప్రమాదవశాత్తు వరి బురద పొలంలో పడిపోయారు. ముక్కు మూసుకుపడిపోవడంతో శ్వాస రాక అక్కడికక్కడే మృతి చెందారు. కొద్దిసేపటి తర్వాత అటువైపు వెళ్లిన రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా అప్పటికే విగత జీవిగా ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

EENADU e Classifieds

REAL ESTATE

LAND FOR SALE

16 Guntas Land Karimnagar Hyd. Highway Road. R.K.Colony with House and Borewell. Contact: 9848043704, 7780646886.

JOBS

ప్రముఖ సోలార్ కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. నెలకు 20వేలు + ఇన్సెంటివ్స్. మీ మండలాలలో పట్టణాలలో ఉండి పనిచేయాలి. Ph: 7075019021

రాఘవ అసెట్ ఫైనాన్స్‌లో బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ GDK-4, PDPL-4, KNR-5, HZB-2, JGL-4, SRCL-4, మంథని-4 కావలెను. సెల్: 91009 02181, 82

FACULTY/ TEACHERS

Wanted: Full Time High School Social Teacher at Veenadhari H/S. CPD, KNR. 94944 99771. Salary: 30k to 50k

Wanted Teachers to teach Primary Hindi Contact: Siddhartha High School, Varahaswamy Temple, Bommakal Road, Karimnagar. Cell: 95026 51843, 98662 35525.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

Book Your 5 Lines Classified Advertisement for B & W Rs.490/- Only Colour Rs. 575/- Only GST 5% Applicable in Classifieds on any day For further details Contact: 80087 09949 80087 09950 80087 09954

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 80087 09949

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80085 14779

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే : బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధికా జైశ్వాల్ సోమవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ మహేష్ బి.గితె తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. 2021లో తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ మైనర్ బాలికను జనగాంకు చెందిన యటెల్లి విజయ్ అనే వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడగా, బాలిక తల్లి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై లక్ష్మారెడ్డి కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయగా, కోర్టు మానిటరింగ్ ఎస్సైలు రవీందర్‌నాయుడు, శ్రవణ్ యాదవ్ ఆధ్వర్యంలో 18 మంది సాక్షులను ప్రవేశపెట్టారు. పీపీ ఝాన్సీ వాదించగా, కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధించినట్లు తెలిపారు. నిందితుడికి శిక్ష పడటంలో కృషి చేసిన డీఎస్పీ నాగేంద్రచారి, తంగళ్లపల్లి ఎస్సై అశోక్, కోర్టు కానిస్టేబుళ్లు రాజేందర్, నవీన్, పోక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల, భరోసా సెంటర్ సభ్యులు లహరికను ఎస్పీ అభినందించారు. మహిళల భద్రతకు పోలీస్ శాఖ ప్రాధాన్యం ఇస్తోందని, ఎవరైనా వేధింపులకు గురైతే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

క్షుద్ర పూజల పేరుతో టోకరా

వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మహేష్ బి.గితె

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే : క్షుద్ర పూజలు, మంత్రాలు, చేతబడుల పేరుతో అమాయక ప్రజలను నమ్మించి భారీగా డబ్బులు వసూలు చేస్తూ మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను సిరిసిల్ల పోలీసులు అరెస్టు చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళను టార్గెట్ చేసి క్షుద్ర పూజలతో నయం చేస్తామని చెప్పి ఆమె నుంచి రూ.62 లక్షలు దండుకొని చివరికి పోలీసుల చేతికి చిక్కారు. సిరిసిల్ల థాణాలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మహేష్ బి.గితె వివరాలను వెల్లడించారు. ఆయన వివరాల ప్రకారం.. కరీంనగర్ మంకమ్మతోటకు చెందిన శ్యాంకుమార్ ప్రస్తుతం హైదరాబాద్‌లో పూజా సామగ్రి దుకాణం నిర్వహిస్తున్నాడు. వేములవాడ మండలం అగ్రహారం గ్రామానికి చెందిన పి.లక్ష్మీరాజంతో అతడికి పరిచయం ఉంది. ఇద్దరూ కలిసి క్షుద్రపూజలు, మంత్రాల పేరిట మోసం చేయాలని పథకం పన్నారు. ఉప్పల్‌కు చెందిన లత అనే మహిళ శ్యాంకుమార్‌ను కలిసి కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నానని చెప్పింది. ఇదే అదనుగా తీసుకున్న శ్యాంకుమార్ క్షుద్రపూజలతో దీర్ఘకాలిక వ్యాధులను లక్ష్మీరాజం అనే వ్యక్తి నయం చేస్తాడని చెప్పి ఆమెను సిరిసిల్ల తీసుకొచ్చాడు. పూజా సామగ్రి కోసం రూ.10 లక్షలు, యాదాద్రి వద్ద పూజ కోసం రూ.21 లక్షలు, కాశీలో పూజ పేరిట రూ.13 లక్షలు, విడతల వారీగా మొత్తం రూ.62 లక్షలు వసూలు చేశారు. ఎన్ని రోజులైనా అనారోగ్యం నయం కాకపోవడంతో తానిచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా సదరు నిందితులు బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ నెల 23న డబ్బులు తిరిగిస్తాం. . సిరిసిల్లకు రమ్మని చెప్పి.. ఎంతకూ కలవకపోవడంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి అగ్రహారంలోని లక్ష్మీరాజం ఇంటి వద్ద ఇద్దరిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రూ.30.50 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు, రెండు బెల్లం బొమ్మలు, తదితర సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ శ్రీనివాస్, ఎస్సై గణేష్ ఉన్నారు.

కేజీబీవీ విద్యార్థిని ప్రేమ వివాహం

ముత్తారం, న్యూస్‌టుడే: కేజీబీవీ విద్యార్థిని ప్రేమ వివాహం చేసుకొన్న సంఘటన పెద్దపల్లి జిల్లాలో చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలానికి చెందిన ఓ విద్యార్థిని ముత్తారం మండల కేంద్రంలోని కేజీబీవీలో ఇంటర్ చదువుతోంది. విద్యార్థిని ఆగస్టు 23న కడుపులో నొప్పి ఉందని చెప్పడంతో సిబ్బంది ఆమె తల్లికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. తర్వాత తన పెద్దమ్మ వస్తుంది అని చెప్పగా ఓ మహిళ రాగా సిబ్బంది పంపించారు. విద్యార్థిని తీసుకెళ్లే సమయంలో రిజిస్టర్‌లో ఆమె ఫోన్ నంబరు నమోదు చేశారు. కుమార్తెను చూసేందుకు సోమవారం తల్లి రాగా సిబ్బంది 23న పంపించినట్లు తెలిపారు. తమ వాళ్లు ఎవరూ రాలేదని సిబ్బందికి తెలుపగా వారు రిజిస్టర్‌లో నమోదైన నంబర్‌కు ఫోన్ చేయగా తాను ప్రేమించిన యువకుడిని ప్రేమ వివాహం చేసుకొన్నట్లు విద్యార్థిని తెలిపింది. దీంతో సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. తర్వాత పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. మరోసారి పోలీసులు ఫోన్ చేసి వివరాలు ఆరా తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ స్వామి, ఎస్సై రవికుమార్ తెలిపారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

జగిత్యాలలో మాట్లాడుతున్న జగదీశ్వర్

జగిత్యాల ధరూర్ క్యాంపు, న్యూస్‌టుడే: మేనిఫెస్టో హామీ మేరకు రాష్ట్రప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనుదారుల సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఉద్యోగ ఐకాస రాష్ట్ర ఛైర్మన్ మారం జగదీశ్వర్ డిమాండ్ చేశారు. జగిత్యాలలోని టీఎన్జీవో కార్యాలయంలో సోమవారం జరిపిన ఐకాస జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీపీఎస్ రద్దు కోరుతూ సెప్టెంబరు 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలని, 10న చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. పీఆర్సీ అమలు, పెండింగ్‌లోని 6 డీఏల విడుదల, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనుదారుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలన్నారు. ఐకాస జిల్లా ఛైర్మన్ మిర్యాల నాగేందర్‌రెడ్డి, కన్వీనర్ కందుకూరి రవిబాబు, పలు సంఘాల నాయకులు అమరేందర్‌రెడ్డి, వకీల్, అమర్‌నాథ్‌రెడ్డి, హరికిరణ్, సురేశ్, హరి అశోక్‌కుమార్, శ్రీనివాస్, రవీందర్, అరుణ, కరుణాకర్, విజేందర్, గంగనర్సయ్య, మహమూద్, శైలజ, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

భార్యపై హత్యాయత్నం కేసులో భర్తకు రెండేళ్లు..

గోదావరిఖని, న్యూస్‌టుడే: భార్యపై కత్తెరతో హత్యాయత్నానికి పాల్పడ్డ భర్తకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ గోదావరిఖని జడ్జి జీవన్ సూరజ్ సింగ్ సోమవారం తీర్పు ఇచ్చారు. గోదావరిఖని ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. . స్థానిక విఠల్‌నగర్‌కు చెందిన పర్లపల్లి సంపత్(43) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో డబ్బుల కోసం భార్య స్వప్నపై గొడ్డలితో దాడికి పాల్పడ్డాడు. తర్వాత పెద్దల సమక్షంలో మరోసారి తప్పు చేయనని క్షమాపణ చెప్పి భార్యను కాపురానికి తీసుకెళ్లాడు. అయినప్పటికీ అతనిలో మార్పు రాలేదు. భార్య తన వద్ద దాచుకున్న రూ.వెయ్యి ఇవ్వడం లేదన్న కోపంతో కత్తెరతో మెడ, పక్కటెముకలపై విచక్షణారహితంగా గాయపరిచాడు. స్వప్న తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఒకటో పట్టణ పోలీసులు సంపత్‌ను కోర్టులో హాజరుపరిచారు. అనంతరం ఛార్జిషీటు దాఖలు చేశారు. ఈమేరకు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా నిందితునికి రెండేళ్ల జైలుశిక్షతో పాటు రూ.పదివేల జరిమానా విధించినట్లు సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. కోర్టు కానిస్టేబుళ్లు సతీష్‌కుమార్, కె.శంకర్‌ను డీసీపీ రాంరెడ్డి, ఏసీపీ రమేశ్‌ను సీపీ అభినందించారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

● ఫైనాన్సు ఒత్తిళ్లే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ

మహేశ్

ధర్మపురి, న్యూస్‌టుడే: ముదిరాజ్‌కాలనీలో సోమవారం సాయంత్రం పంబాల మహేశ్(29) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ధర్మపురి ఎస్సై నాగపురి సదాకర్ తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మహేశ్ 2022లో ఇంటి నిర్మాణం కోసం ఓ ఫైనాన్సు నుంచి రూ. 10 లక్షల వరకు రుణం తీసుకుని ఈఎంఐల ద్వారా చెల్లిస్తున్నారు. అనారోగ్య కారణాలు, ఆర్థిక ఇబ్బందులతో ఈఎంఐలు చెల్లించడం ఆపేశారు. దీంతో నెల క్రితం సంబంధిత ఫైనాన్సు నిర్వాహకులు ఇంటికి వచ్చి మిగతా డబ్బు చెల్లించకుంటే ఇంటిని జప్తు చేసి వేలం వేస్తామని హెచ్చరించి ఒత్తిడికి గురి చేసినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. సోమవారం ఇంటికి వచ్చిన ఫైనాన్సు నిర్వాహకులు గోడపై 'ఈ ప్రాపర్టీ ఫైనాన్సు తనఖాలో ఉందని' రాసి మరోమారు హెచ్చరించారు. దీంతో మనస్తాపం చెందిన మహేశ్ ఒంటరిగా ఉన్న సమయంలో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, ఫైనాన్సు వారి ఒత్తిడి, ఇంటిని వేలం వేస్తామని భయపెట్టిన కారణంగా అవమానానికి లోనై ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆరోపించారు.

చెరువులో మునిగి యువకుడి మృతి

భూయ్యాన్

మంథని గ్రామీణం, న్యూస్‌టుడే: చేపల కోసం వెళ్లి చెరువులో మునిగి యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం మండలంలోని అడవి సోమన్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. మంథని ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం.. ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన చోటు భూయ్యాన్(26) గ్రామంలో సమీకృత వసతి గృహ భవన నిర్మాణ పనుల్లో కూలీగా పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం గ్రామంలోని అడవిలోని మిడి చెరువులో చేపలు పట్టేందుకు నలుగురు వెళ్లారు. వీరిలో భూయ్యాన్ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందారు. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపకశాఖ అధికారులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. సైట్ ఇన్‌ఛార్జి రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు. అగ్నిమాపకశాఖ అధికారి శివశంకర వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యాపారి..

కార్తిక్

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే: వ్యాపారాలు చేసి నష్టాలు రావడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యాపారి కరీంనగర్‌లోని ఓ లాడ్జిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఒకటో థాణా ఎస్సై శేఖర్ వివరాల ప్రకారం వేములవాడకు చెందిన నరాల కార్తిక్ (33) చీటీల వ్యాపారం చేస్తుండేవారు. నష్టాలు రావడంతో మూడేళ్లుగా రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేశారు. అందులోనూ నష్టాలు రావడంతో అప్పులపాలయ్యారు. ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురైన కార్తిక్ తన కారులో కరీంనగర్‌కు పనిపై వెళ్తున్నట్లు భార్యకు చెప్పారు. రాత్రి భార్య ఫోన్ చేయగా లిఫ్ట్ చేయపోవడంతో కుటుంబ సభ్యులు కరీంనగర్‌లో వెతకడం ప్రారంభించారు. అలకాపురి కాలనీలోని ఓ లాడ్జి వద్ద కారు కనిపించడంతో వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 4 PM)
గోదావరిఖని : 80085 73573
పెద్దపల్లి : 80085 73656
మంథని : 94407 28281

? **కమాన్‌పూర్:** ముల్కలపల్లికి వెళ్లే దారిలో పిచ్చిమొక్కలు పెరిగి ఇబ్బందిగా మారింది. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. **- స్థానికులు**
✔ రహదారిపైకి వచ్చిన పిచ్చిమొక్కలను తొలగిస్తాం. వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూస్తాం. **- రాము, కార్యదర్శి**

పాఠశాలలకు సామగ్రి సరఫరా

మంథని, న్యూస్‌టుడే: ఈ విద్య సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బూట్లు, బెల్టులు, బ్యాగులను సరఫరా చేసినా పంపిణీ చేయలేదు. ఏకరూప దుస్తులు అందకపోవడంతో అన్ని వస్తువులు ఒకేసారి ఇవ్వాలనే ఆలోచనతో 20 రోజులు గడిచినా విద్యార్థులకు పంపిణీ చేయకుండా నిలిపివేశారు. ఈ విషయమై 'ఈనాడు'లో చిత్ర వార్త ప్రచురితం కాగా మండల విద్యాధికారి లక్ష్మి స్పందించారు. మండలంలో 59 పాఠశాలలకు సామగ్రిని సోమవారం సరఫరా చేసి వెంటనే విద్యార్థులకు అందజేయాలని ఆదేశించారు.

పాలకవర్గ సమావేశంలో 44 అంశాలకు ఆమోదం

సుల్తానాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: సుల్తానాబాద్ పురపాలికలో సోమవారం నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో 44 అంశాలతో రూపొందించిన ఎజెండాకు ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు ఛైర్మన్ రాధాకృష్ణ పేర్కొన్నారు. పట్టణ పరిధిలో మూడు వర్షపు నీటి ఇంకుడు గుంతలు నిర్మించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. దోమలు ప్రబలకుండా వార్డుల్లో ఫాగింగ్, మురుగునీటిపై స్ప్రే కొనుగోలుతోపాటు తాగునీటి పైప్‌లైన్ల లీకేజీలను అరికట్టేందుకు సామగ్రి కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. పురపాలిక పరిధిలో కుంటలు అన్యాక్రాంతం అవుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులతో సర్వే చేసేందుకు తీర్మానం చేసినట్లు చెప్పారు. కమిషనర్ రమేశ్, వైస్ ఛైర్ పర్సన్ పుష్పలతతోపాటు పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వైఫల్యాలపై భారాస పోరుబాట

పెద్దపల్లి, న్యూస్‌టుడే: వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు భారాస ఆధ్వర్యంలో సెప్టెంబరు 2 నుంచి పోరుబాటలో భాగంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి తెలిపారు. పోరుబాట కార్యక్రమాలపై పార్టీ కార్యకర్తలకు సోమవారం మార్గనిర్దేశం చేశారు. ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 2న ఆరు గ్యారంటీలు, 3న రైతు సదస్సులు, 4న మహిళ, దివ్యాంగులతో ప్రత్యేక కార్యక్రమాలు, 5న విద్యార్థి, యువత సమస్యలు, 6న గ్రామీణ, పట్టణ సమస్యలు, 7న ప్రజావాణిలో ప్రభుత్వానికి వినతులు, 8న జిల్లా స్థాయి ప్రెస్‌మీట్లు, 10న ఉద్యోగ సంఘాల పోరాటానికి సంఘీభావ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వీటికోసం కార్యకర్తలు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు ఉప్పు రాజ్‌కుమార్, మార్కు లక్ష్మణ్, వెన్నం సుజాత, రవిందర్, నూనెటి సంపత్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

గోదావరిఖని, న్యూస్‌టుడే: మహిళపై అత్యాచారం చేసిన నిందితుడిని గోదావరిఖని ఒకటో పట్టణ పోలీసులు సోమవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక శివాజీనగర్‌కు చెందిన ఎం.డి.నదీంబాబా(30) ఆగస్టు 28న ఫైవింక్లయిన్ బస్టాప్ వద్ద నిలుచున్న మహిళను సాయం చేస్తానని చెప్పి నమ్మించి నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. అనంతరం అక్కడి నుంచి పారిపోయాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

పెద్దపల్లి, న్యూస్‌టుడే: పెద్దపల్లి మండలం కుర్మపల్లి వద్ద అక్రమంగా తరలిస్తున్న 12 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు పెద్దపల్లి రూరల్ ఎస్సై మధుకర్ తెలిపారు. గ్రామంలో తనిఖీలు నిర్వహిస్తుండగా ఆటో ట్రాలీలో తరలిస్తున్న బియ్యం పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్తు చౌర్యం కేసులో జరిమానా

భగత్‌నగర్, న్యూస్‌టుడే: పాలకుర్తి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన బుర్ర సతీష్ విద్యుత్తు చౌర్యం కేసులో ఆ జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి సునీత కుంచాల సోమవారం రూ.4,059 జరిమానా విధించారని యాంటీ పవర్ తెఫ్ట్ స్క్వాడ్(ఏపీటీఎస్) సీఐ షాదుల్లా బాబా, ఎస్సైలు ఓంకార్, కళ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జరిమానా చెల్లించడంలో విఫలమైతే మూడు నెలల సాధారణ జైలు శిక్ష విధించనున్నట్లు తీర్పు చెప్పారని వివరించారు.

వ్యవసాయ మోటార్ల తీగల చోరీ

పాలకుర్తి(అంతర్గాం): అంతర్గాం మండలం ఇస్సంపేట-మద్దిర్యాల గ్రామాల మధ్య వ్యవసాయ మోటార్లకు సంబంధించిన విద్యుత్తు తీగలు చోరీకి గురైనట్లు రైతులు సోమవారం తెలిపారు. సుమారు పది మంది రైతుల వ్యవసాయ మోటార్లకు చెందిన విద్యుత్తు తీగలను ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు వాపోయారు. ఒక్కో రైతుకు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు నష్టం వాటిల్లిందని తెలిపారు.

అక్షర పునాది పటిష్ఠంగా ఉండాలి

పెద్దపల్లి కలెక్టరేట్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లల్లో అక్షర పునాది పటిష్ఠంగా ఉండాలని కలెక్టర్ శ్రీహర్ష తెలిపారు. సమీకృత పాలన ప్రాంగణంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులతో ఎఫ్ఎల్ఎన్‌పై సమీక్షించారు. జిల్లా అకాడమిక్ కోఆర్డినేటర్ పీఎం షేక్ పాల్గొన్నారు.

మలుపులో పొంచి ఉన్న ముప్పు

ఫెర్టిలైజర్ సిటీ, గౌతమినగర్ తదితర ప్రాంతాల నుంచి గోదావరిఖని వైపు వెళ్లే ప్రధాన రహదారిలో లూర్దునగర్ మలుపులో ప్రమాదం పొంచి ఉంది. మలుపులోని మార్గబిలం పొంగి మురుగు రోడ్డుపై నిలుస్తుండటంతో పాటు వర్షం కురిస్తే మరింత ఇబ్బందికరంగా మారుతోంది.

- న్యూస్‌టుడే, ఫెర్టిలైజర్ సిటీ

శునకాల బెడద.. తీరేదెలా?

రామగిరి మండలం సెంటినరీకాలనీలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. పాఠశాలలు, ప్రధాన వీధులు, కాలనీల్లో గుంపులుగా తిరుగుతూ స్థానికులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. పాఠశాలల పరిసరాల్లో తిరుగుతుండటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కమాన్‌పూర్**

పట్టణాభివృద్ధికి సహకరించాలి: విప్

పెద్దపల్లి, న్యూస్‌టుడే: పెద్దపల్లి పట్టణాభివృద్ధివైపు కౌన్సిలర్లందరు అడుగులు వేయాలని ప్రభుత్వ విప్ విజయరమణారావు పేర్కొన్నారు. పెద్దపల్లి పురపాలిక ఛైర్మన్ నూగిళ్ల మల్లయ్య అధ్యక్షతన జరిగిన పాలకమండలి సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి పాలకమండలి సభ్యులు నిబద్ధతతో పనిచేయాలన్నారు. దసరా నాటికి రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని చెప్పారు. అంతకుముందు పురపాలిక పరిధిలో పలు అభివృద్ధి పనులకు సోమవారం భూమిపూజ నిర్వహించారు. రూ.50లక్షలతో డంపింగ్‌యార్డులో కంపోస్టు షెడ్ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు అందజేశారు.

కంపోస్టు షెడ్ నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న విప్ విజయరమణారావు

ఓదెల: హరిపురంలో సోమవారం ప్రభుత్వ విప్ సీహెచ్.విజయరమణారావు పలువురు లబ్ధిదారులకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

సుల్తానాబాద్ గ్రామీణం: 15వ వార్డులో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వవిప్ ప్రారంభించారు.

సమస్యలు పరిష్కరించరూ..

నీటి సరఫరా అస్తవ్యస్తం..

గ్రామంలో తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం చేస్తున్నారు. మానేరు పాత పైపులైన్ మరమ్మతు చేసినప్పటికీ ప్రయోజనం లేదు. వాటర్ ట్యాంక్ వద్ద శుభ్రత, క్లోరినేషన్ వివరాలు కనిపించడం లేదు. పైపులైన్ లీకేజీతో కలుషితమవుతోంది. గేట్‌వాల్వ్ గుంతలు తీసి వదిలేశారు. నీటి సరఫరా పునరుద్ధరించాలి.

- ముత్తయ్య, మడక, ఓదెల మండలం

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్

సమీకృత పాలన ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో బాధితులు సమస్యలను ఏకరవు పెట్టారు. ఏళ్ల తరబడి ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని వాపోయారు. కాస్తులో ఉన్న భూమికి పట్టా రాలేదని, వైకల్య ధ్రువపత్రం ఉన్నప్పటికీ పింఛన్ లేక పోవడంతో బతుకు దుర్భరంగా ఉందని, గుడిసెల్లో నివసిస్తున్న సొంతగూడు లేక అవస్థలు పడుతున్నామని ఇలా పలువురు తమ కష్టాలు విన్నవించారు. ప్రతి ఒక్కరి సమస్యను వింటూ పరిష్కరించే చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో కలెక్టర్ శ్రీహర్ష, అదనపు పాలనాధికారి శ్రీరాములు పాల్గొన్నారు.

సమస్యలు వివరిస్తున్న ప్రజలు

ప్రశాంతంగా పోలీసు సంఘం ఎన్నికలు

గోదావరిఖని, న్యూస్‌టుడే: పోలీసు సంఘం ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. నోడల్ అధికారిగా అదనపు డీసీపీ కె.శ్రీనివాస్, ఎన్నికల కమిటీ సభ్యులు అదనపు డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ నాగేంద్రగౌడ్, రమేశ్, ఏవో శ్రీనివాస్‌ల పర్యవేక్షణలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు. ఎన్నికల్లో 70 మంది పోలీసు అధికారులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అధ్యక్షుడిగా నవీన్‌కుమార్(కానిస్టేబుల్), ఉపాధ్యక్షుడిగా ఎన్.శ్రీనివాస్(సీఐ), ఎం.తిరుపతి(ఏఎస్సై), ప్రధాన కార్యదర్శిగా జె.ఆంజనేయులు(ఎస్సై), సంయుక్త కార్యదర్శిగా కె.ఓంకార్(కానిస్టేబుల్), సంస్థాగత కార్యదర్శి డి.వినోద్ బాబు(కానిస్టేబుల్), కార్యనిర్వాహక సభ్యులుగా ఎం.డి.రిజ్వాన్ షా ఖాన్, డి.అనిల్‌కుమార్, దేవరాజ్, కార్యవర్గ సభ్యులుగా రజిత, ఎ.కపిల్, డి.రాజం ఎన్నికయ్యారు. కొత్తగా ఎన్నికైన కార్యవర్గం రామగుండం సీపీని కలిశారు.

కొత్తగా ఎన్నికైన పోలీసు సంఘం ప్రతినిధులతో సీపీ అంబర్ కిశోర్ ఝా

గోదావరిఖని : రామగుండం కమిషనరేట్ పరిధిలో ఉద్యోగ విరమణ పొందిన నలుగురు సిబ్బందిని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా సోమవారం సన్మానించారు. ఎస్సై ఎం.రవీందర్, ఏఎస్సైలు బసవదీపక్, దుంపల కొమురయ్య, హెడ్‌కానిస్టేబుల్ మధునయ్య ఉద్యోగ విరమణ పొందారు. అదనపు డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్, ఏవో శ్రీనివాస్, ఆర్ఐ రమేష్, సీసీ సందీప్ పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీపై అక్రమ కేసును రద్దు చేయాలని నిరసన

గోదావరిఖని, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీపై పెట్టిన అక్రమ కేసును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక చౌరస్తాలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న భాజపా ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. నగర కాంగ్రెస్ అధ్యక్షులు బొంతల రాజేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బేగంపేట క్రాస్‌రోడ్డు వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను నిరసిస్తూ రామగిరి మండలం బేగంపేట క్రాస్‌రోడ్డు వద్ద కాంగ్రెస్ నాయకులు నల్లబ్యాడ్జీలతో సోమవారం నిరసన చేపట్టారు. మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు పార్టీ అధ్యక్షుడు రొడ్డ బాపన్న ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతియాదవ్ మాట్లాడారు. రామ్మూర్తి, సదానందం, పోశం, వరప్రసాద్, దేవక్క, దివ్య, కొమురయ్య, సమ్మయ్య, సుధాకర్, అవినాష్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

తొలి మావోయిస్టు మహిళా నేత కన్నుమూత

రాధక్క

ఈటీవీ-ఆదిలాబాద్, న్యూస్‌టుడే, ఎదులాపురం: తెలంగాణ తొలి మావోయిస్టు ఆదివాసీ మహిళ, మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న సతీమణి కుర్సెంగ్ మోతీబాయి అలియాస్ రాధక్క(55) అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందారు. మూడురోజుల కిందట ఆదిలాబాద్ రిమ్స్‌లో చేరిన ఆమె సోమవారం సాయంత్రం గుండెపోటుతో తుదిశ్వాస వదిలారు. ఆమె స్వస్థలం ఆదిలాబాద్ గ్రామీణ మండలం పిప్పల్‌ధరి. బాల్యం నుంచే ఆదివాసీ హక్కుల కోసం నినదించిన ఆమె 1984లో పీపుల్స్‌వార్‌లో చేరారు. దళసభ్యురాలి నుంచి రాష్ట్ర కమిటీ బాధ్యతల నిర్వహణ వరకు ఆమె ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు. విప్లవోద్యమ కార్యకలాపాలు, కార్యక్రమాల అవసరాలరీత్యా పార్టీ ఆమెను 1998లో ఛత్తీస్‌గఢ్‌కు బదిలీ చేసింది. అక్కడ ఆదివాసీలను సంఘటితం చేయటంతో పాటు జనతా సర్కార్‌లో చురుకైన పాత్ర పోషించారు. 2017లో అనారోగ్యం కారణంగా ఆసుపత్రికి వెళ్తుండగా ఆమె ప్రయాణిస్తున్న వాహనం ఖమ్మం దగ్గర వెంటాడుతున్న పోలీసులను తప్పించే క్రమంలో బోల్తాపడింది. గాయాలతో బయటపడి పోలీసులకు పట్టుబడిన ఆమె నాలుగేళ్లపాటు జైలు జీవితం గడిపారు. ఆ తర్వాత ఆమెపై ఉన్న కేసులను కోర్టు కొట్టివేసింది. గతేడాది నవంబరులో చంద్రన్న ఉద్యమం నుంచి బయటకు వచ్చిన తర్వాత ఇద్దరు కలిసి రామగుండంలో ఉంటున్నారు. ఇటీవల అనారోగ్యానికి గురవడంతో పిప్పల్‌ధరికి వచ్చిన ఆమె మూడురోజుల కిందట రిమ్స్‌లో చేరారు. మంగళవారం మధ్యాహ్నం లింగుగూడలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు. ఆమె మృతిపై ప్రజాసంఘాల బాధ్యులు, వామపక్షవాదులు నివాళులర్పించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మంథని, న్యూస్‌టుడే: మంథని మున్సిపల్ పరిధిలోని పదో వార్డులో చేపడుతున్న అభివృద్ధి పనులను పుర ఛైర్మన్ శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ శ్రీనివాస్ మట్లాడుతూ డీఎంఎఫ్‌టీ నిధులు రూ.50 లక్షలతో పిల్లల పార్కు నుంచి గొడుగు బంగ్లా వరకు సీసీరోడ్డు, డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నామన్నారు. వైస్ ఛైర్మన్ సహేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు పెంటరి రాజు, వంశీధర్, తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబరు 2 నుంచి ప్రజల్లోకి

గోదావరిఖని, న్యూస్‌టుడే: సెప్టెంబరు 2 నుంచి వారం రోజుల పాటు ప్రజల్లోకి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన తప్పుడు వాగ్దానాలపై ప్రచారం చేస్తామని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, భారాస నాయకులు కౌశికహరి, ఎం.రాజిరెడ్డి వెల్లడించారు. గోదావరిఖనిలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. రామగుండం నియోజకవర్గంలో ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు.

పంచాయతీ సిబ్బందికి నోటీసుల జారీ వివాదాస్పదం

ధర్మారం, న్యూస్‌టుడే: రాఖీ పూర్ణిమ రోజు ఉదయం పనిచేసి మధ్యాహ్నం బంధువుల రాకతో విధులకు రాని పారిశుద్ధ్య కార్మికులకు పంచాయతీ కార్యదర్శి నయీమ్ నోటీసులు జారీచేయడం వివాదాస్పదమైంది. ఈ విషయమై సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయానికి భాజపా, వీహెచ్‌పీ శ్రేణులు చేరుకొని నిరసన చేపట్టారు. పంచాయతీ కార్యదర్శిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపీడీవో వి.సుమలత అక్కడకు చేరుకుని అందరికీ సర్ది చెప్పారు. పాలకవర్గానికి తెలియకుండా నోటీసులు జారీచేయడాన్ని ఎంపీడీవో తప్పు పట్టారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి కార్మికులకు క్షమాపణలు చెప్పారు. భాజపా నాయకులు మేడవేని శ్రీనివాస్, సందినేని లక్ష్మణ్, సాయి, తిరుపతి, బాలకృష్ణ, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇదే విషయమై గ్రామపంచాయతీ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు సీపెల్లి రవీందర్ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల సిబ్బంది ధర్మారంలో ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు. కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్, మండల అధ్యక్ష, కార్యదర్శులు గంగాధర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శికి మెమో జారీ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

ఎన్టీపీసీ సిబ్బందికి సన్మానం

ఉద్యోగుల కుటుంబ సభ్యులతో ఎన్టీపీసీ ఈడీ, అధికారులు

జ్యోతినగర్(మార్కండేయకాలనీ): ఎన్టీపీసీ రామగుండం, తెలంగాణ పరిశ్రమలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులను ఈడీ చందన్‌కుమార్‌సమంత సోమవారం సన్మానించారు. సోమవారం ఎన్టీపీసీ పర్మనెంట్ టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఎన్టీపీసీ మెకానికల్ మెయింటెనెన్స్ ఇంజినీర్ వుడుతల గిరి, ఎస్ఎల్‌పీఎస్ ఇంజినీర్ ఆపరేషన్ అరెండాల వెంకటేశ్వర్లు, ఇంజినీర్ ఆపరేషన్ ముత్యం రాజన్న, ఫ్యూయల్ హ్యాండ్లింగ్ ఆపరేషన్ మేకల రామస్వామి ఉద్యోగ విరమణ పొందారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆందోళన

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: తాను బతికి ఉండగానే మరొకరికి అక్రమంగా పట్టా చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సోమవారం కలెక్టరేట్ ఎదుట బాధితులు ప్లకార్డులతో ఆందోళన చేశారు. పాలకుర్తి మండలం బామ్లానాయక్ తండా శివారులో ఉన్న 24 గుంటల భూమిని తప్పుడు మరణ, ఇతర ధ్రువపత్రాలతో మరొకరికి పట్టా చేశారని బాధితురాలు సుజాత ఆరోపించారు. విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుని తన భూమికి పట్టా హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. సుజాతకు మద్దతుగా పలువురు ఆందోళనలో పాల్గొన్నారు. కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

ఒకే ఇంటికి మూడు నంబర్లు

కాల్వశ్రీరాంపూర్: ఒకే ఇంటికి మూడు ఇంటి నంబర్లు కేటాయించడంతో ఇబ్బందులు పడుతున్నానని, అదనంగా కేటాయించిన నంబర్లను తొలగించాలని కోరుతూ కిష్టంపేటకు చెందిన పల్లెర్ల చక్రపాణి ప్రజావాణిలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. కిష్టంపేటలోని తన ఇంటిని తన కుమారుడికి గిఫ్టుగా ఇచ్చామని, అదే ఇంటికి పంచాయతీ అధికారులు అదనంగా 3-7/ఎ, 3-7/బి అనే మరో రెండు నంబర్లు గ్రామ పంచాయతీ రికార్డుల్లో నమోదు చేశారని తెలిపారు. ఈ విషయాన్ని కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లానని, పట్టించుకోకపోవడంతో ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

ఏఐటీయూసీతోనే కార్మికుల సమస్యల పరిష్కారం

మాట్లాడుతున్న వైవీరావు, సాంబశివరావు

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: కార్మికుల సమస్యల సాధనలో భాగంగా ఏఐటీయూసీ సింగరేణి యాజమాన్యంతో ఒప్పందం చేసుకొన్నట్లు సంఘం డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వైవీ రావు, ఆర్జీ-2 కార్యదర్శి సాంబశివరావు తెలిపారు. సోమవారం కాలనీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యాజమాన్యాన్ని మెప్పించి ఒప్పించి 26 డిమాండ్లు సాధించామన్నారు. 11 ఏళ్లు గుర్తింపు సంఘంగా ఉన్న తెలంగాణ బొగ్గుగని కార్మికసంఘం కార్మికులకు ఏం చేయకపోగా చందాల దందాతో కటకటాల పాలైన తీరును కార్మిక వర్గం చూసిందన్నారు. కార్మికుల సమస్యల సాధన కోసం కట్టుబడి పనిచేసే ఏకైక సంఘం ఏఐటీయూసీ మాత్రమే అన్నారు. రాజరత్నం, అన్నారావు, శ్యాంసన్, మహేందర్, శంకర్, రోహిత్‌రెడ్డి, గంగాదర్, మల్లేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఖాళీలను భర్తీ చేయండి

గోదావరిఖని, న్యూస్‌టుడే: వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని గుర్తింపు సంఘం నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం సాయంత్రం స్థానిక జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో జీఎం లలిత్‌కుమార్ సమక్షంలో గుర్తింపు సంఘం నాయకులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గత సమావేశంలో చర్చించిన అంశాలు ఏ మేరకు పరిష్కరించారన్న దానిపై సమీక్షించారు. కొత్తగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఏరియా ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రంలో మరికొన్ని పడకలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్మిక వాడల్లో కొన్ని ప్రాంతంలో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. శ్రీను, వెంకటరెడ్డి, మహేశ్, రాజు, మల్లికార్జున్, మహేందర్, అధికారులు చంద్రశేఖర్, తిరుపతి, ఆంజనేయులు, జితేందర్‌సింగ్, శ్రీనివాస్, వరప్రసాద్, డాక్టర్ ప్రసన్నకుమార్, ఎల్.రమేశ్, శ్రీనివాస్, వేణు, శ్రావణ్‌కుమార్, ఫిరోజ్ ఖాన్, హన్మంతరావు తదితరులున్నారు.

సమావేశంలో జీఎం లలిత్‌కుమార్, గుర్తింపు సంఘం నాయకులు

2 నుంచి ఏరియా స్థాయి క్రీడా పోటీలు

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: ఆర్జీ-2 ఏరియా వర్క్‌పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌ను ఈ నెల 2 నుంచి 9 వరకు నిర్వహించనున్నట్లు అధికార ప్రతినిధి వేణుగోపాల్ తెలిపారు. ఈ నెల 2న కబడ్డీ పోటీలు కాలనీలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో, 3న వాలీబాల్ పోటీలు డాక్టర్ అబ్దుల్‌కలాం క్రీడామైదానం ఆవరణలో, 5న ఫుట్‌బాల్ పోటీలు, 6న బాడీబిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్‌లిఫ్టింగ్, షటిల్, టెబుల్‌టెన్నిస్ పోటీలు సీఈఆర్ క్లబ్ ఆవరణలో, 7న బాల్‌బ్యాడ్మింటన్, 9న హాకీ, 11, 12 తేదీల్లో క్రికెట్ పోటీలు, 13న సాంస్కృతిక కార్యక్రమాలు, క్యారమ్ పోటీలు సీఈఆర్ క్లబ్ ఆవరణలో నిర్వహిస్తామన్నారు. తొలిరోజు ఆర్జీ-2 జీఎం లక్ష్మీపతిగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభిస్తారని తెలిపారు.

తెబొగకాసం బాధ్యుల నియామకం

గోదావరిఖని: తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం బలోపేతం చేసేందుకు ఏరియాల వారీగా ప్రత్యేకంగా బాధ్యులను నియమించారు. ఈమేరకు రామగుండం-1, 2 డివిజన్లకు కొమురయ్య, ఆర్జీ-3, భూపాలపల్లికి పర్లపల్లి రవిని నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

సమావేశాలను విజయవంతం చేయండి

గోదావరిఖని, న్యూస్‌టుడే: సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని సంఘం నాయకులు టి.రాజారెడ్డి, ముత్యంరావు కోరారు. అక్టోబరు 10, 11 తేదీల్లో గోదావరిఖనిలో నిర్వహించే కౌన్సిల్ సమావేశాలకు జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు హాజరవుతారని తెలిపారు. కుమారస్వామి, భిక్షపతి, శ్రీనివాస్, వనజారాణి, జ్యోతి, రామాచారి, అంజయ్య, లక్ష్మారెడ్డి, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుతో ఇబ్బందులు

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ): ఆర్జీ-3 ఏరియా ఓసీపీ-2 అధికారులు విధుల్లో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఓసీపీ-2 ఎలక్ట్రిషియన్ సదానందం ఆరోపించారు. రామగిరి మండలం సెంటినరీకాలనీలో సోమవారం విలేకరుల సమావేశంలో కార్మికుడు మాట్లాడారు. కొందరు యూనియన్ నాయకుల మాటలు విని యాజమాన్యం ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. మస్టర్లు, ఇంక్రిమెంట్లు తొలగిస్తూ సస్పెన్షన్ పత్రాలు ఇస్తున్నారని దీనిపై పలుమార్లు ఫిర్యాదులు, వినతిపత్రాలు అందించినట్లు తెలిపారు.

ఉద్యోగ విరమణ అధికారులకు సత్కారం

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: ఆర్జీ-3, ఏపీఏలో ఉద్యోగ విరమణ పొందిన ఏరియా పర్యావరణ అధికారి రాజారెడ్డి, ఏపీఏ ప్రాజెక్టు ఇంజినీర్ రఘురామ్‌లను ఆర్జీ-3 జీఎం మధుసూదన్, ఏపీఏ జీఎం నాగేశ్వరరావు సోమవారం సన్మానించారు.

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ): ఏపీఏలో ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్ మేకల మల్లేశం, జనరల్ అసిస్టెంట్ కెమెరా చిన్న లింగయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా జీఎం నాగేశ్వరరావు సన్మానించారు.

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ-2లోని ఓసీపీ-3లో ఈపీ ఆపరేటర్ ఎండీ నసీమోద్దీన్‌ఖాన్‌ను ప్రాజెక్టు అధికారి సుజన్‌మెహ్రా, ఏఐటీయూసీ నాయకులు సాంబశివరావు సన్మానించారు. భద్రత విభాగంలో జమేదార్ అబ్దుల్‌మజీద్‌ను ఎస్‌వోటూ జీఎం రాముడు, ఎస్ఎస్‌వో షరీఫ్‌మహ్మద్‌ను సన్మానించారు.

రాజారెడ్డిని సన్మానిస్తున్న జీఎంలు మధుసూదన్, నాగేశ్వరరావు

గోదావరిఖని: ఉద్యోగ విరమణ పొందిన అధికారులు, ఉద్యోగులను జీఎం లలిత్‌కుమార్ సోమవారం సన్మానించారు. సివిల్ ఏజీఎం నాగేశ్వర్‌రావు, ఇంజినీరింగ్ ఏజీఎం రాజాజీ, అటెండర్ పార్వతిలను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

(c) eenadu